

## రేషన్ బియ్యానికి బదులుగా రాగుల పంపిణీ

శ్రీకాకుళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు డిసెంబరు నెల కోటాలో ఐదు కిలోల బియ్యం బదులుగా మూడు కిలోల రాగులను పంపిణీ చేయనున్నట్లు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని రేషన్ షాపులో రాగుల పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు.

## టెక్కలి డివిజన్‌లోకి నందిగాం

- పలాస నుంచి మార్పు
- ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ
- అభ్యంతరాలకు 30 రోజుల గడువు

శ్రీకాకుళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. పరిపాలనా సౌలభ్యం, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో నందిగాం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు(జీవో ఆర్టీ 1490) జారీచేశారు. ఇది కేవలం ముసాయిదా(ప్రాథమిక) నోటిఫికేషన్ మాత్రమేనని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ జిల్లా ఏర్పాటు చట్టం-1974 నిబంధనల ప్రకారం ఈ మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే దీనిపై తుది నిర్ణయం వెలువడనుంది. నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలుపుతూ ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే తెలియజేయడానికి అవకాశం కల్పించారు. ఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి 30రోజుల్లోగా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా(తెలుగు లేదా ఇంగ్లీషులో) తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మార్పుపై స్థానికంగా ప్రజల స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. గడువులోగా వచ్చిన వినతులను ప్రభుత్వం పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది.



నందిగాం మండల కేంద్రం వ్యూ

## పలాస రోడ్డు పనుల్లో అవకతవకలు

- రిటైర్డ్ డీఈఈ పెన్షన్‌లో ఐదు శాతం కోత
- పూర్వ కమిషనర్ పెన్షన్‌లోనూ 8 శాతం కటింగ్
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

శ్రీకాకుళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):


పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోని రోడ్డు నిర్మాణ పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.భాస్కరరావుపై, అప్పటి మునిసిపల్ కమిషనర్ (ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగి) ఎంపీడీ ఫణిరామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పూర్వ కమిషనర్ పెన్షన్‌లో 8 శాతం, రిటైర్డ్ డీఈఈ పెన్షన్‌లో 5 శాతం చొప్పున శాశ్వతంగా కోత విధిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

**● అసలేం జరిగిందంటే..**

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని అంతరకుడ్డ నుంచి చినబాడాం వరకు చేపట్టిన రోడ్డు పనుల నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరిపి 2013లో నివేదిక సమర్పించింది. అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.భాస్కరరావుతోపాటు మరో ముగ్గురి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫారస్సు చేసింది. ప్రభుత్వం నియమించిన విచారణ అధికారి(అప్పటి సూపరిండెంట్ ఇంజనీర్-జీవీఎంసీ) బీహెచ్ శ్రీనివాసరావు జరిపిన పూర్తిస్థాయి విచారణలో కె.భాస్కరరావుపై అభియోగాలు నిజమేనని తేలింది. అయితే తాను 2019లోనే ఉద్యోగ విరమణ చేశానని.. తనపై తలపెట్టిన శిక్షను రద్దు చేయాలని భాస్కరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఇచ్చిన వివరణలో సహేతుకమైన కారణాలు లేవని భావించిన ప్రభుత్వం ఆ విజ్ఞప్తిని తిరస్కరించింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగిగా ఉన్న కె.భాస్కరరావు పెన్షన్ నుంచి శాశ్వతంగా ఐదు శాతం మొత్తాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం తుది ఉత్తర్వులు జారీచేసింది. తక్షణమే ఉత్తర్వులను అమలు చేయాలని ఇంజనీర్ ఇన్ చీఫ్‌ను ఆదేశించింది.

**● బిల్లుల చెల్లింపుపై ఆరోపణలు..**

అంతరకుడ్డ - చినబాడాం రహదారి పనులకు సంబంధించి ముఖ్యంగా కాంట్రాక్టర్‌కు గడువు పొడిగింపు ఇవ్వకుండానే నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించారన్న ఆరోపణలు అప్పట్లో కమిషనర్‌గా ఉన్న ఫణిరామ్‌పై వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన ప్రభుత్వం ఆరోపణలు నిజమేనని నిర్ధారించింది. ఈ వ్యవహారంపై తొలుత (మిగతా 4వ పేజీలో..)



అంతరకుడ్డ- చినబాడాం రహదారి (ఫైల్)

## భార్య హత్య కేసులో జీవిత ఖైదు

శ్రీకాకుళం క్రైం/ పొందూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో పొందూరు మండలం బాణాం గ్రామానికి చెందిన జీరు వెంకటరమణకు జీవిత ఖైదీ శిక్ష పడిందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జీరు వెంకటరమణ, రమణమ్మ దంపతులు బాణాంలో నివసించేవారు. భార్య రమణమ్మ తీరుపై వెంకటరమణ అనుమానం పెంచుకున్నాడు. వారిద్దరి మధ్య గొడవ జరగ్గా ఆవేశంతో కత్తితో ఆమెను నరికి చంపేశాడు. 2018 మార్చి 14న ఈ ఘటన జరగ్గా వెంకటరమణ కొద్దికాలం పాటు జైలు శిక్ష అనుభవించి.. బెయిల్‌పై బయటకు వచ్చాడు. కాగా ఐదేళ్లుగా ఆయన కోర్టుకు హాజరుకాకపోవడంతో శ్రీకాకుళం ఫస్ట్‌క్లాస్ కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంటీ జారీ చేసింది. ఈ మేరకు ఆమదాలవలస సీఐ, పొందూరు ఎస్ఐ.. నిందితుడ్ని గుంటూరులో అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పీపీ కింజరాపు శ్రీనివాసరావు వాదనలు వినిపించగా, కోర్టు ట్రయిల్‌ను వేగవంతంగా పూర్తిచేసింది. నేరం రుజువు కావడంతో వెంకటరమణకు శ్రీకాకుళం ఫస్ట్ అడిషనల్ కోర్టు న్యాయాధికారి పి.బాలకృష్ణారావు రూ.2వేలు జరిమానాతోపాటు జీవితఖైదు విధిస్తూ గురువారం తీర్పునిచ్చారని ఎస్పీ తెలిపారు.

## ప్రాణం తీసిన అతివేగం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- రెండు ద్విచక్ర వాహనాలు ఢీ
- ఇద్దరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- గరుడఖండి వద్ద ఘటన

సుశాంత్‌కుమార్, భీమారావు (ఫైల్)

పలాస/రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పలాస మండలం పాత జాతీయరహదారి గరుడఖండి గ్రామం సమీపంలో గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహ నాలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాతపట్నం మండలం సరాళి గ్రామానికి చెందిన తలగాపు భీమారావు(25), పలాస మండలం వీరభద్రాపురానికి చెందిన తలగాపు వేణు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి పలాస వస్తున్నారు. ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి సమితి డెరబా గ్రామానికి చెందిన సుశాంత్‌జెన్నా(26) ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తూ.. గరుడఖండి సమీపంలో వారి వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో ముగ్గురూ చెల్లాచెదురుగా పడిపోయారు. భీమారావు, సుశాంత్ జెన్నా అక్కడికక్కడే మృతి చెందారు. వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసులు చేరుకున్నారు. భీమారావు రోడ్డుపై పడి మృతి చెందగా, సుసాంత్‌జెన్నా సమీప పొదల్లో పడి ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన గంటవరకూ వారి వివరాలు లభించలేదు. సెల్‌ఫోన్ల ఆధారంగా వివరాలు గుర్తించారు. అనంతరం వారి బంధువులకు సమాచారాన్ని అందించారు. స్థానికుల సహకారంతో వేణును అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండు వాహనాలు కూడా మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

● భీమారావు, వేణు ఇద్దరూ బంధువులు. వీరభద్రాపురంలో జరిగిన ఓ వేడుకకు హాజరైనట్లు గ్రామస్థులు తెలిపారు. వీరు కాశీబుగ్గలో సొంత పనిమీద ద్విచక్రవాహనంపై వచ్చినట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. వేణుకు కాలు, చేయి విరిగిపోయి అపస్మారకస్థితిలో ఉన్నాడు. పలాస ప్రభుత్వాసుపత్రి నుంచి ఆయన్ను శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అలాగే భీమారావు, సుశాంత్ జెన్నా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

**సరాళిలో విషాదఛాయలు..**

పాతపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలం సరాళిలోని పెద్దవీధికి చెందిన భీమారావు మృతితో గ్రామంలో (మిగతా 4వ పేజీలో..)

## మృతదేహాల కోసం ఎదురుచూపు

- పెదంచల, వీరరామచంద్రపురం గ్రామాల్లో విషాదఛాయలు

పలాసరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పలాస మండలం వీరరామచంద్రపురానికి చెందిన పైడి సాయికుమార్ (24), పెదంచల గ్రామానికి చెందిన ఇల్లాకుల నవీన్‌కుమార్ (23) మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఎదురుచూస్తున్నారు. ఈ గ్రామాలకు చెందిన పలువురు అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లి తిరిగొస్తుండగా తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం వద్ద బుధవారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. సాయికుమార్, నవీన్ కుమార్ మృతి చెందారు. మరో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే మృతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులు హుటాహుటిన విమానంలో రామేశ్వరం ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ పోస్టుమార్టం తంతు పూర్తయిన తర్వాత మృతదేహాలను తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారు. అలాగే క్షతగాత్రుల్లో ఇద్దరి రామనాథ్‌పూర్ ఆస్పత్రిలో, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరికి మధురై ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నట్టు సమాచారం అందింది. ఈ ఘటనతో పెదంచల, వీరరామచంద్రపురం గ్రామాలో విషాదం నెలకొంది. నవీన్‌కుమార్, సాయికుమార్ మృతదేహాల కోసం ఎదురుచూస్తూ.. వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులను మాజీమంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు బి.దుర్యోధన, దువ్వాడ రవికుమార్ పరామర్శించారు.

## ఇరుకు గదుల్లోనే..

- కొన్నిచోట్ల పూర్తికాని సచివాలయ భవనాలు
- మరికొన్ని చోట్ల ప్రారంభానికి నోచుకోక..
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది, ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం

6లో



## ఏపీ శాసనసభ అంచనాల కమిటీకి ఘనస్వాగతం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ అంచనాల కమిటీ సభ్యులు గురువారం జిల్లాకు చేరుకున్నారు. కమిటీలో చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు (ఎమ్మెల్యే), డాక్టర్ వి.వి.సత్యనారాయణ రాజు(ఎమ్మెల్సీ), వరుదు కళ్యాణి(ఎమ్మెల్సీ), రాష్ట్ర శాసనసభ డిప్యూటీ కార్యదర్శి కె.రాజాకుమార్, అసిస్టెంట్ సెక్రటరీ వి.భిక్షం, ఎస్.ఓ. టి.చిరంజీవి ఉన్నారు. వీరికి జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మణమూర్తి, ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, డీఎస్పీ సీహెచ్.వివేకానంద, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ సుధాకర్ ఘనంగా స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు శుక్రవారం అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాలను సందర్శించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

## బాజాభజంత్రీలకు బ్రేక్!

4లో

- నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు నిలిచిపోనున్న శుభకార్యాలు

## మేం 'అన్నదాత సుఖీభవ'కు అర్హులం కాదా?

- సేతుభీమవరం రైతుల ఆందోళన

4లో

## ఉపాధిహామీ నిధుల దుర్వినియోగం

- రిటైర్డ్ ఎంపీడీవో పెన్షన్‌లో కోత

5లో

## సముద్ర ఇసుకనూ వదల్లే!

- జిల్లాలో యథేచ్ఛగా విక్రయాలు
- సాధారణ ఇసుకలో కలిపి దగా
- అక్రమార్కుల కొత్త దందా ఇది
- ప్రమాదమంటున్న నిపుణులు
- గృహనిర్మాణదారుల్లో ఆందోళన



కాశీబుగ్గలో అన్‌లోడ్ చేస్తున్న సముద్రపు ఇసుక

కాశీబుగ్గ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సముద్రపు ఇసుక విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు నదుల వద్ద లభ్యమయ్యే సాధారణ ఇసుకలో సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తున్నారు. నిర్మాణ రంగాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. ప్రభుత్వం ఇసుక విధానాన్ని సరళతరం చేసి ఉచితంగా అందిస్తోంది. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అలవాటుపడినవారు సముద్రపు ఇసుకను అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

జిల్లాలో ప్రస్తుతం పెద్దఎత్తున గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇటీవల వర్షాలు కురవడంతో నదులు, కాలువల్లో ఇసుక లభ్యత లేదు. దీంతో అక్రమార్కుల కన్ను సముద్రపు ఇసుకపై పడింది. జిల్లాలో 11 మండలాల్లో 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ప్రతి చోటా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నదుల ఇసుకలో అధిక భాగం సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తున్నారు. ప్రధానంగా పలాస, కాశీబుగ్గ, సోంపేట, ఇచ్ఛాపురం తదితర పట్టణాల్లో ఈ దందా నడుస్తోంది. శ్రీకాకుళం సమీపంలోని మడపాం ఇసుక అంటూ సన్నపు ఇసుకను తెచ్చి నిర్మాణదారులకు విక్రయిస్తున్నారు. వైసీపీ హయాంలో టిప్పర్ లోడు రూ.30 వేలకుపైగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టడంతో రవాణాతో పాటు కూలీల చార్జీలంటూ టిప్పర్‌లోడు రూ.18వేలకు విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల లారీ ఇసుక లోడ్ రూ.20వేల నుంచి రూ.25వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**● చాలా ప్రమాదం..**

వాస్తవానికి సముద్రతీర ప్రాంతంలో ఉన్న సన్నని ఇసుకను గృహ నిర్మాణానికి వినియోగించరు. సముద్రపు ఇసుకలో ఉప్పు శాతం అధికం. దీనిని సిమెంట్‌తో కలిపితే అది సులువుగా మిశ్రమం అవ్వదు. నిర్మాణం కూడా బలంగా ఉండదు. పటుత్వం కోల్పోతుంది. సముద్రపు అలలతో ఇసుకలో ఉండే సత్తువంతా పోతుంది. అందుకే సముద్రపు ఇసుకతో నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో నిపుణులు అంగీకరించరు. కానీ అక్రమార్జనకు అలవాటు పడినవారు సముద్రపు ఇసుకను విక్రయిస్తుండడంతో గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రహదారుల నిర్మాణానికి సైతం ఇదే ఇసుకను వాడుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వీరి దోపిడీకి నిర్మాణ రంగం ప్రమాదంలో పడినట్టు అవుతోంది. అధికారులు స్పందించి.. సముద్రపు ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

## 'అదనం' ధాన్యంపై ఆరా

- సీఎంవో కార్యాలయ ఆదేశాలతో కంబకాయిలో నాణ్యత పరిశీలన
- రైతుల వద్ద వివరాలు సేకరణ.. జేసీకి నివేదిక

నరసన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అదనం పేరిట రైతులను ఇబ్బందులు పెడుతున్న వ్యవహారంపై సీఎంవో కార్యాలయం అధికారులు దృష్టి సారించారు. నరసన్నపేట మండలం కంబకాయి గ్రామానికి తంగి రవీంద్ర, సి.రాజారావు అనే రైతులు పంపించే ధాన్యాన్ని దేశవానిపేటలోని బాలాజీ రైస్ మిల్లర్ దించకుండా.. వారికి అదనంగా ఆరు కేజీల ధాన్యం లేదా నగదు ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం పత్రికల్లో కథనాలు రావడంతో సీఎంవో కార్యాలయ అధికారులు స్పందించి జిల్లా సివిల్‌సప్లయ్‌శాఖ అధికారులకు ఆరా తీశారు. దీంతో సివిల్‌సప్లయ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారి హరిశంకర్ ఆధ్వర్యంలో పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖ అధికారులు గురువారం కంబకాయిలో సుమారు 40మంది రైతులతో మాట్లాడారు. మండలంలో కొందరు మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరించి అదనంగా ధాన్యం వసూళ్లు చేస్తున్నారని రైతులు తెలిపారు. బాలజీ రైస్ మిల్లర్ వ్యవహరించిన తీరుపై రైతులు తంగి రవీంద్ర, సి.రాజారావు నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం గ్రామంలో రైతులు పండించే ధాన్యం నాణ్యత, బియ్యం దిగుబడులను ఈలింగ్ యంత్రాల సహాయంతో పరిశీలించారు. దిగుబడి నాణ్యత బాగానే ఉన్నట్లు క్వాలిటీ కంట్రోల్ (మిగతా 4వ పేజీలో..)



కంబకాయిలో రైతులతో మాట్లాడుతున్న సివిల్‌సప్లయ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

## ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈఆర్వో, ఏఈఆర్వోలను ఆదేశించారు. గురువారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని, కచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలి. బీఎల్వోలతో సమావేశాలు నిర్వహించాలి. సవరణలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిగణనలోకి తీసుకోవాల'ని సూచించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఫారం 6,7,8 కి సంబంధించి పూర్తికాని వారి వివరాలను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో లక్ష్మణమూర్తి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.



ఆహారం వేటలో అరుదైన నల్ల కొంగల గుంపు

# నల్ల కొంగల కనువిందు



● ఆహారం వేటలో అరుదైన పక్షులు

సహజంగా తెలుపు రంగు కొంగలను చూస్తాం.. అయితే అరుదుగా ఉండే నల్ల కొంగలను చూస్తే ఆ ఆనందమే వేరు.. అదే సాకారమైంది శ్రీకాకుళం రూరల్ మండలం మోపసు బందరు గ్రామంలో.. నీటితో నిండిన పొలంలో నలుపు రంగు కొంగల గుంపు ఆహారం కోసం వేట చేయడం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. ఈ అరుదైన దృశ్యాన్ని చూసిన బాటసారులు ఎంతో ఆశ్చర్యంగా తిలకిస్తూ ఆనందపడ్డారు.

-అరసవల్లి, ఆంధ్రజ్యోతి



పీర్లకొండపై దర్గా వద్ద భక్తుల తాకిడి

# పీర్లకొండకు తరలి వచ్చిన భక్తులు

ఇచ్ఛాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన పీర్ల కొండ యాత్రకు రెండో గురువారం భక్తులు పోటెత్తారు. పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశా, హైదరాబాద్, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల స్వామికి అత్యంత ఇష్టమైన అటుకులు, బెల్లాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం కొండపై ఉన్న రెండు మందిరాల్లో భక్తులు పూజలు చేశారు. కొండపై ఉన్న కందకంలోని నీటిని పవిత్ర తీర్థంగా స్వీకరించారు. కోరిన కోరికలు నెరవేరాలని దర్గా చుట్టూ గీతలు గీశారు. కొండపై కూర్చొని తేలుకుంచి గ్రామం చెట్లపై ఉన్న విదేశీ పక్షులు, చిలక సముద్రం, కైలాసగిరి చూసి ఆహ్లాదంగా గడిపారు.

# దైవభక్తితో ఆధ్యాత్మిక యాత్ర

● 29 రోజుల్లో 6,739 కిలోమీటర్లు ● ఇదీ ఎర్రముక్కాం వాసి విశిష్టత



ఓం పర్వతం వద్ద జాతీయ జెండాతో కామేష్



హిమాలయాల్లో మానస సరోవరం వద్ద..

సోంపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ కుర్రాడికి దైవభక్తి ఎక్కువ. ఆధ్యాత్మికత మనల్ని మంచి మార్గంలో నడిపిస్తుందని నమ్ముతాడు. స్వతహాగా ఆర్ఎస్ఎస్ కార్యకర్త కావడంతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ముందుంటాడు. ఇదే అతన్ని మోటార్ సైకిల్‌పై సాహస యాత్ర చేప ట్టేందుకు ప్రేరణనిచ్చింది. ఆ కుర్రాడి పేరు పుక్కళ్ల కామేశ్వరరావు (39). సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామవాసి. ఉద్దానం ప్రాంతంలో ఇలాంటి యాత్ర చేపట్టిన మొదటి వ్యక్తి అతడే. దాదాపు 29 రోజుల పాటు సాగిన ఆ యాత్ర అనుభవాలు అతని మాటల్లోనే.. 'ప్రధాని మోదీ సిద్ధాంతాలంటే నాకు ఇష్టం. ప్రస్తుతం బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. యువతలో దైవభక్తిని... ఆధ్యాత్మిక చింతనను పెంచాలనేది నా సంకల్పం. ఇదివరకు మహా కుంభ మేళాకు, సంపూర్ణ భారతదేశ యాత్రకు మోటార్ సైకిల్ (రాయల్ ఎన్‌ఫీల్డ్)పై వెళ్లాను. ఈసారి ఆధ్యాత్మిక యాత్ర చేపట్టాలనే ఉద్దేశంతో సిద్ధమయ్యాను. అక్టోబరు 16న మా స్వగ్రామం ఎర్రముక్కాం నుంచి యాత్ర ప్రారంభించాను. గతంలో ఉన్న యాత్రల అనుభవం ఈసారి ఉపయోగపడింది. మొత్తం 29 రోజుల పాటు యాత్ర సాగింది. 6,739 కిలోమీటర్ల దూరం ప్రయాణించాను. ఈ క్రమంలో వివిధ ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించాను. ఒడిశా మీదుగా ప్రారంభమైన యాత్రలో తొలుత పూరీకి సమీపంలోని వరచండిని... అనంతరం పూరీ జగన్నాథుని దర్శించుకున్నాను. మహాకైలాస్ (టిబెట్), ఆదికైలాస్, ఓం పర్వతం (ఉత్తరాఖండ్) అధిరోహించాను. నేపాల్ గంజ్ నుంచి వీరేంద్రనగర్ వెళ్లే ప్రాంతాల్లో రహదారులు భయంకరంగా ఉన్నా...వెరవకుండా యాత్ర సాగించాను. నేపాల్, టిబెట్ తదితర ప్రాంతాల్లో యాత్ర సాగింది. ఇల్లు విడిచి 29 రోజులు తర్వాత దైవభక్తి ఉన్న ప్రతి ఒక్కరికి ఇటువంటి యాత్రలు ప్రేరణ ఇస్తాయి. యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందితే సన్మార్గంలో నడవడానికి అవకాశం ఉంటుంది. యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని.. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా తిరిగి రావడం ఆనందంగా ఉంది' అని చెబుతున్నారు కామేశ్వరరావు.

## 'అదనం' ధాన్యంపై ఆరా

(మూడో పేజీ తరువాయి)

అధికారులు గుర్తించారు. ఈలింగ్ యంత్రాల్లో 20 పాయింట్లు వద్ద ఫిక్స్ చేసి ధాన్యం మరపెట్టి బియ్యం దిగుబడి అంచనా వేయాల్సి ఉండగా, కొందరు మిల్లర్లు మాత్రం 30 పాయింట్లు ఫిక్స్ చేసి ఈలింగ్ చేయడంతో ఈ సమస్య వచ్చిందని పేర్కొన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు జిల్లా సివిల్‌సప్లయ్‌శాఖ డీఎం వేణుగోపాలరావు తెలిపారు. అంతకుముందు శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష కూడా సంబంధిత మిల్లును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, సీఎస్‌డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

## పలాస రోడ్డు పనుల్లో అవకతవకలు

(మూడో పేజీ తరువాయి)

ఆగస్టు 2024లో జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఫణిరామ్‌కు రెండు వార్షిక ఇంక్రిమెంట్లు నిలిపివేయాలని నిర్ణయించారు. అయితే ఆయన 2025 జూన్ 30న రిటైర్డ్ అయ్యారు. మొదటి ఇంక్రిమెంట్ 2024 డిసెంబరులో నిలిపివేసినా రెండో ఇంక్రిమెంట్ 2025 డిసెంబరు నాటికి ఆయన సర్వీసులో ఉండరు కనుక పాత శిక్షను అమలు చేయడం సాధ్యం కాలేదు. దీంతో ప్రభుత్వం పాత ఉత్తర్వులను రద్దు చేసి రిటైర్డ్ అయిన అధికారికి వర్తించేలా ప్రత్యామ్నాయ శిక్షను ఖరారు చేసింది.

● ఎనిమిది శాతం పెన్షన్ కోత..

ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980లోని రూల్ 9 ప్రకారం ఫణిరామ్ పెన్షన్‌లో ఎనిమిది శాతాన్ని శాశ్వతంగా కోత విధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు షోకాజ్ నోటీసు ఇచ్చినప్పుడు ఫణిరామ్ తన వివరణ ఇస్తూ.. ఇది తనకు తీరని ఆర్థిక నష్టమని.. శిక్షణ తగ్గించాలని కోరారు. అయితే ఆయన వివరణలో పసలేదని భావించిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్పిస్తూ తుది ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీ సురేష్‌కుమార్ జీఓ ఆర్టీ నంబర్ 1343 ద్వారా ఆదేశాలు జారీ చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

## వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

● ధాన్యం కొనుగోలుకు తక్షణ చర్యలు తీసుకోవాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోస్తా జిల్లాల్లో రానున్న నాలుగు రోజు లు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, సంక్షేమ వసతి గృహాలు, ఆర్టీజీఎస్, ప్రజా సానుకూల దృక్పథం తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఒకవేళ ధాన్యం తడిచినట్లు ఫిర్యాదులు వస్తే అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి గోనె సంచులు, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. గోనె సంచుల కొరత లేదని, అలాగే జిల్లాలోని వసతి గృహాల్లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల వివరాలను తెలియజేశారు. అన్న క్యాంటీన్లు, పారి శుధ్య నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రిగ్స్ జిల్లా పోటీలకు సర్వం సిద్ధం




గ్రిగ్స్ పోటీలకు జ్ఞాపికలను సిద్ధం చేసిన అధికారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న గ్రిగ్స్ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల స్థాయిలో గ్రిగ్స్ పోటీలు ఇప్పటికే ప్రారంభించగా, అక్కడ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు నియోజకవర్గాల తోపాటు జిల్లాస్థాయి పోటీల్లో విజేతలకు మెంమోంటోలు, పతకాలు, చాంపియన్‌షిప్ ట్రోఫీతో పాటు సర్టిఫికేట్లను సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి గురువారం పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలు డిసెంబరు 8 నుంచి 12వ తేదీల్లోగా, జిల్లాస్థాయి పోటీలు డిసెంబరు 18 నుంచి 24వ తేదీల మధ్య నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.తవిటయ్య, కార్యదర్శి ఎంవీరమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, ఆర్.స్వాతి, గ్రిగ్స్ సెక్రటరీ టి.శ్రీనివాసరావు, ఆర్.రవి, కె.మాధవరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

## ట్రక్‌షీట్ జనరేట్ చేయకుంటే ధాన్యం తీసుకోవద్దు

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



మిల్లులో గల ధాన్యం నిల్వలపై ఆరా తీస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జలుమూరు (సారవకోట), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు పంపించిన ధాన్యానికి ట్రక్‌షీట్ జనరేట్ చేయకుండా వచ్చిన ధాన్యాన్ని తీసుకోవద్దని మిల్లర్లకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. బుడితిలోని భవానీ రైసుమిల్లును గురువారం ఆయన పరిశీలించారు. మిల్లులో గల ధాన్యం నిల్వపై జేసీ ప్రశ్నించారు. రైతులకు సరైన కళ్లాలు లేక, ఖాళీ స్థలాలు లేక మిల్లులో పెడుతున్నట్లు మిల్లర్ వివరించారు. ఈ విషయమై సంబంధిత రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ట్రక్కుషీట్ జనరేట్ కుకుంటే ధాన్యానికి బిల్లులు చెల్లించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ జాఫర్ షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అతివేగం

(మూడో పేజీ తరువాయి)



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తలగాపు వేణు

విషాదఛాయలు అలుముకున్నాయి. భీమారావు పలాస సమీపాన బి.కొత్తూరులో చిన్నాన్నవాళ్ల నూతనగృహప్రవేశానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందని తల్లి లక్ష్మి, తమ్ముడు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే ఇదేప్రమాదంలో మృతి చెందిన సుశాంత్‌జెన్నా.. భార్య రీనాగొమాంగో, రెండున్నరేళ్ల కుమారుడు ఆయుష్‌కుమార్‌తో కలిసి పలాసలో నివాసం ఉంటున్నారు. హోల్‌సేల్ గుడ్డ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. సుశాంత్‌జెన్నా మృతితో ఇక తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులదే కీలకపాత్ర

● ఎస్పీ మహేశ్వరరెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

మందస/హరిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులదే కీలక పాత్రని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. మందస పోలీసుస్టేషన్‌ను గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి మాట్లాడారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులపై విచారణ చేపట్టి 60 రోజు ల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులు తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. సరిహద్దు గ్రామాల ప్రజలతో మాట్లాడివారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న శేతుభీమవరం రైతులు

## మేం 'అన్నదాత సుఖీభవ'కు అర్హులం కాదా?

● సేతుభీమవరం రైతుల ఆందోళన

జి.సిగడాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తామంతా ప్రభుత్వం అమలు చేసిన 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హులం కాదా అని పెనసాం పంచాయతీ శేతుభీమవరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పథకం నగదు పడకపోవడంతో గ్రామంలో గురువారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు శ్రీరాములు, బొల్లు జిమ్మ నాయుడు, బి.రమణ, ఎస్.రమణ, వి.తాతారావు, కె.ఈశ్వరరావు, కె.సురేష్, ప్రసాద్, వి.శిమ్మ య్య, పైల సింహాచలం, పి.ఆదినారాయణ, బి.సూరిబాబు, ఎస్.రాము, పి.గంగులు, పి.పద్మ, టి.కృష్ణ తదితరులు ఆందోళన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో రైతులందరికీ రైతు భరోసాలో భాగం గా అందరి ఖాతాల్లో డబ్బులు జమయ్యేవని, కూటమి ప్రభుత్వంలో రెండు విడతల్లోనూ పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ పథకానికి తాము నోచుకోలేదన్నారు. గతంలో అర్హత ఉన్న తాము ఇప్పుడు అర్హులం కాదా అని ప్రశ్నించారు. గ్రామ రైతులపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదన్నారు. గ్రామంలో సుమారు 150 మంది రైతులు పూర్వం నుంచి సుమారు 520 ఎకరాల ఈనాం భూములు సాగుచేసుకుంటూ ఫలసాయం పొందుతున్నామన్నారు. ఈనాం భూములకు సంబంధించి పట్టాలివ్వాలని పలుమార్లు ప్రభుత్వాలు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించలేదన్నారు. ఇప్పటికైనా అన్నదాత సుఖీభవ పథకం మంజూరు చేసి న్యాయం చేయాలని, లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు వెనుకాడబోమని వారు హెచ్చరించారు.




# బాజాభజంత్రీలకు బ్రేక్!

● శుక్రమూఢమితో 80 రోజులు నిలిచిపోనున్న శుభ కార్యక్రమాలు

● నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శుక్రమూఢమి ప్రభావంతో ఈనెల 28 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ వరకు బాజాభజంత్రీలు నిలిచిపోనున్నాయి. మౌఢ్యమి అంటే శూన్యం. శుభ కార్యక్రమాలు నిర్వహించడానికి గురుబలం ఎక్కువగా ఉండాలి. అలాగే సంతోషం, సంపద కలగాలంటే శుక్రబలం ఎక్కువగా ఉండాలి. ఈ రెండు గ్రహాల బలం తగ్గిపోతుండడంతో శుభ కార్యక్రమాలు మూఢమిలో జరిపించేందుకు పెద్దలు అంగీకరించరు. శుక్రవారం నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు గృహప్రవేశాలు, కొత్తబోర్లు తవ్వకాలు, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించడం, ఉపనయనాలు, ముఖ్యంగా పెళ్లిల్లు వంటి శుభ కార్యక్రమాలు జరపరు. కేవలం దైవ కార్యక్రమాలు మాత్రం కొనసాగించవచ్చు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 తరువాత శుభ కార్యక్రమాలకు మంచిరోజులు కాబట్టి ఆ తరువాతనే జరుపుకోవచ్చు. మూఢమి రోజుల్లో ఏవైనా శుభ కార్యక్రమాలు చేస్తే దోషమని జ్యోతిష్యులు చెబుతున్నారు. దీంతో సుమారు 80రోజుల పాటు శుభ కార్యక్రమాలు నిలిచిపోనుండడంతో మేళతాళాలకు, కల్యాణ మండపాలకు, పురోహితులకి, విందు వంటలు వండేవారికి, ఫొటో, వీడియోగ్రాఫర్లకు, సప్లయర్స్‌కు, ఫ్లవర్ డెకర్స్‌కు, బంగారం, వెండి వ్యాపారులు, వస్త్ర వ్యాపారులకు, శుభ కార్యక్రమాలు చేయాల్సిన వ్యాపారాలన్నీ తగ్గుముఖం కానున్నాయి. మొత్తంగా శుక్రమూఢమి ప్రభావంతో 80 రోజులు పెళ్లిళ్ల, గృహ ప్రవేశాలు నిలిచిపోనునాయి.

### శూన్యమాసంలో పెళ్లిళ్లు చేయరాదు..



శూన్యమాసంలో పెళ్లిళ్ల చేయకూడదు. అలాగే ఎటువంటి శుభ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇది అనువైన కాలం కాదు. దైవ కార్యక్రమాలు చేసుకోవడానికి మాత్రమే అవకాశం ఉంటుంది. సుమారు 80 రోజుల పాటు శుక్రమూఢమి ప్రభావం ఉంటుంది.

-శ్యామసుందర శతపతి, పురోహితులు

## జీవీఎంసీకి డిప్యుటేషన్‌పై శ్రీకాకుళం ఏఎఫ్‌వో

శ్రీకాకుళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త(డీసీహెచ్‌ఎస్) కార్యాలయంలో అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్ (ఏఎఫ్‌ఓ)గా పనిచేస్తున్న జి.నాగార్జునరావుకు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డీపీవోగా డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శాఖకు చెందిన నాగార్జునరావును 'ఫారిన్ సర్వీస్' నిబంధనల కింద ఏడాది కాలానికి డిప్యూటేషన్‌పై జీవీ ఎంసీలో డీపీవోగా నియమించారు. కొత్త బాధ్యతలు స్వీకరించే సమయంలో నిబంధనల ప్రకారం ఆయనకు అవసరమైన శిక్షణ ఇప్పించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో ఆర్టీజీఎస్ సెషన్‌పై కూడా శిక్షణ ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## ఆమదాలవలస ఎంపీడీవోకు డీడీవోగా పదోన్నతి

శ్రీకాకుళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆర్.వెంకటరావుకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో పొందూరు ఎంపీడీవోగా పనిచేసినప్పుడు ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి విచారణ అనంతరం కమిషనర్ 2025 మార్చి 20న తర్వాత చర్యలను విరమించుకున్నారు. దీంతో వెంకటరావు ప్రభుత్వానికి చేసుకున్న విజ్ఞప్తి మేరకు ఈ పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయనను 'అల్లూరి సీతారామరాజు జిల్లా' పాడేరు డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ)గా నియమించారు. ఈ ఉత్తర్వులు జారీ అయిన 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని లేకుంటే నియామకం రద్దవు తుందని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం

● రిటైర్డ్ ఎంపీడీవో పెన్షన్‌లో కోత

శ్రీకాకుళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో రిటైర్డ్ ఎంపీడీవో వై.మహాలక్ష్మికి ఐదేళ్ల పాటు పెన్షన్‌లో పది శాతం కోత విధిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈమె మహాలక్ష్మి కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో ఎంపీడీవోగా పని చేస్తున్న సమయంలో ఉపాధి హామీ పథకం అమలులో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించకుండా పని ప్రదేశంలో వసతుల కల్పన పేరుతో రూ.3,50,700 డ్రా చేయడం, చెల్లింపుల కోసం సంస్థల పేరుతో కాకుండా వ్యక్తుల పేరుతో చెక్కులను జారీచేసిన ఆరోపణలు విచారణలో నిర్ధారణ అయ్యాయి. దీంతో ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980లోని రూల్ 9 ప్రకారం ప్రభుత్వం శిక్ష ఖరారు చేసింది. దీని ప్రకారం వై.మహాలక్ష్మికి ఐదేళ్ల కాలానికి నెలవారీ పెన్షన్‌లో పది శాతం కోత విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఆన్‌లైన్ డ్రైవ్‌లో 70 మంది శివానీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఎచ్చెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ (బెంగుళూరు) నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌లో చిలకపాలెం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 150 మంది విద్యార్థులు పాల్గొనగా 70 మంది ఇంజనీర్ ట్రైనీలుగా ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను కళాశాల యాజమాన్య ప్రతినిధులు సాయినాథ రెడ్డి, కె.దుర్గా శ్రీనివాస్, పి.దుర్గా ప్రసాద్‌రాజు, డి.వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్ అభినందించారు.

## కనీస వేతనాలు అమలుచేయాలి

పొందూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనాలతో లేబర్ యాక్ట్ ప్రకారం హక్కులు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ కోరారు. గురువారం రాజ్యలక్ష్మి పీఎస్‌సీ ఫ్యాక్టరీ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలో కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వారి హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్మికులను వేధిస్తున్నారన్నారు. కొంత మందికి నోటీసులివ్వకుండా అర్ధంతరంగా తొలగించడం దారుణమన్నారు. తక్షణం యాజమాన్యం స్పందించి కార్మికులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యురాలు కృష్ణవేణి, కార్మిక సంఘం నేతలు పక్కి జగత్, అప్పలనాయుడు, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

## పీఎంపీలు ఆసుపత్రులు నడపకూడదు: డీఎంహెచ్‌వో

అరసవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పీఎంపీలు ఆసుపత్రులు నడిపేందుకు వీల్లేదని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత అన్నారు. తన కార్యాలయంలో గురువారం పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఇంజక్షన్లు చేయడం, సెలైన్ పెట్టడం, కుట్టు వేయడం వంటి సేవలు చేయరాదని, అలాగే ఇన్‌పేషెంట్లను ఉంచరాదన్నారు. అలా చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.శిమ్మన్న, కార్యదర్శి ఎన్.లక్ష్మీనారాయణ, రాము, లవుడు, మోహనరావు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా పోటీల్లో వర్షితకు కాంస్యం

ఎచ్చెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా జాతీయ క్రీడల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ శారద డిగ్రీ కళాశాల (శ్రీకా కుళం) విద్యార్థిని గుజ్జల వర్షిత కాంస్య పతకం సాధించింది. రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లో ఈనెల 24 నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో వర్సిటీ తరపున మహిళా కేటగిరీలో 69 కిలోల విభాగంలో వర్షిత పాల్గొంది. వర్షిత ప్రతిభ పట్ల వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్ అభినందించారు.

# కొనసాగుతున్న 'రైతన్నా మీకోసం'

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం ఎమ్మెల్యేలు పాల్గొని రైతులకు పథకాలను వివరించారు.

### రైతు సంక్షేమమే ధ్యేయం: శంకర్



కరపత్రాలు అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వాడాడ గ్రామంలో గురువారం రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు సందేశంతో రూపొందించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: అశోక్

సోంపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం మామిడిపల్లిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి రైతులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047 సాధనలో రైతు తలసరి ఆదాయం రూ.55 లక్షలు లక్ష్యంగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దు కుమార్, నేతలు సూరాడ చంద్రమోహన్, విజయలక్ష్మి, నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బిన్నాల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు



కరపత్రాలిచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

### 'రైతన్నా మీకోసం'లో అదనపు డైరెక్టర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం చాపురం, గూడెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రైతన్నా మీకోసం' కార్యక్రమంలో గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం అదనపు డైరెక్టర్ వీవీ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అందించే ఐదు కార్యాచరణ విధానాలు, ఫార్మర్ యాప్ వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణ సర్వే, మట్టి నమూనాలు పత్రాలు పంపిణీ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సీహెచ్ వెంకటరావు, సబ్ డివిజన్ ఏడీఏ బి.రజని, రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.పి.ఉదయబాబు, ఏవో పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు: బగ్గు

జలుమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కూర్మనాథపురంలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. మిల్లర్లు అదనంగా ఐదారు కిలోల ధాన్యం వసూలు చేస్తుండడం దారుణమన్నారు. రైతులకు అన్యాయం జరిగితే ప్రభుత్వం సహించేది లేదన్నారు. సమావేశంలో ఏడీఏ ఎల్వీ మధు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, ఏవో కె.రవికుమార్, ఉద్యానవన అధికారి కత్తిరి సునీత, టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



చాపురంలో అవగాహన కలిగిస్తున్న వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ విజయలక్ష్మి

### యాంత్రీకరణ వైపు దృష్టి: ఎంజీఆర్

మెళియాపుట్టి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని ఎమ్మె ల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం మర్రిపాడు, సి.జలగలింగుపురం గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అంతర పంటల సాగుపై ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, టీడీపీ నాయకులు ఎస్.మోహనరావు, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు

### అలరించిన నాదస్వర కచేరీ



కన్నన్, ఆనంద్ కచేరీ దృశ్యం

అరసవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన సుప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు ఆర్.కన్నన్, ఆనంద్ సోదరుల నాదస్వర కచేరీ ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఆరామ ద్రావిడ సంఘం, శ్రీ సుమిత్ర కళా సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇప్పిలి జోగారావు 102వ జయంతి వేడుకల్లో భాగంగా రెండో రోజు నాదస్వర కచేరీని ఏర్పాటు చేశారు. ఆర్.కన్నన్, ఆనంద్ ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలను తమ నాదస్వర విన్యాసాలతో అలరించారు. మెట్టుపల్లి రవి, వీఎం గణేష్ డోలుపై వాద్య సహకారం అందజేశారు. కళాకారులతో పాటు ప్రముఖ నాదస్వర విద్వాంసుడు రాళ్లపాటి అచ్చెన్నను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నిర్వాహకులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

### బడివానిపేట విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో బడివానిపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ అండ ర్-14 విభాగంలో ఉప్పాడ మధు రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. ఏడో తరగతి విద్యార్థి ఎం.చందు శ్రీకాకుళంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హర్డిల్స్ పోటీలో మూడో స్థానం సాధించాడు. విద్యార్థులను హెచ్‌ఎం య.శ్రీనివాసరావు, పీడీ టి.ఆనంద్ అభినందించారు.

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఇచ్ఛాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో ఖోఖో పోటీలకు మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు లక్ష్మీకాంతమ్మ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బల్ల శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలకు చెందిన జి.చందన, చాట్ల హరిత, గుజ్జు యామిని అనకాపల్లి జిల్లా లెంకలపాలేంలో జరుగు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎస్‌ఎంసీ చైర్మన్ గిన్ని వెంకటరమణ, కృష్ణయ్య పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: ఎన్ఈఆర్



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కొవ్వాడ మత్స్యలేశం జడ్పీ హైస్కూల్లో బాలబాలికల గ్రిగ్స్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మనసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మైలపల్లి పోలీస్, కొమర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

● పొందూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు పిల్లలవలస జడ్పీ పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, ఎంఈవో-1 వాగ్దేవి, హెచ్‌ఎం బస్వా గొల్లవాడు ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలో విజేతలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు.

● సోంపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో లు కృష్ణంరాజు, జోరాడు, హెచ్‌ఎం కృష్ణారావు, స్థానిక నాయకుడు రాంబుడ్డి గణపతి తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని ఉపాధ్యాయులు తెలిపారు.

● కంచిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెద్ద శ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి గ్రిగ్స్ పోటీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు, టీడీపీ నేత మాదిన రామారావు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు: రవికుమార్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం వేకువజామున పట్టణంలోని 16, 17, 14, 2, 12, 13 వార్డుల్లో ద్విచక్రవాహనంపై 'హలో గుడ్‌మార్నింగ్' అంటూ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానికు లతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని తక్షణం పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవిని ఆదేశించారు. కండ్రపేట, శివన్నారాయణ క్వార్టర్స్, పూజారిపేట, ఐజే నాయుడుకాలనీ, కృష్ణాపురంతో పాటు పట్టణ ప్రధాన మార్గా ల్లో స్కూటీపై ప్రయాణించి పట్టణ పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. రోడ్లపై ఉన్న దుకాణదారులు దుకాణాల ముందు పెద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం తగదన్నారు. జూనియర్ కళాశాల ఎదుట ఎటువంటి దుకాణాలను ఏర్పా టు చేయకుండా నిరోధించాలని, కోర్టు ఎదురుగా ఉన్న దుకాణాలను తొలగించాలని కమిషనర్‌ను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్లపై ఉంచిన ఇసుక, ఇటుకలను తక్షణం తొలగించాలని సచివాలయ శానిటరీ సెక్రటరీకి ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీవీకే రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానం మహోత్కృష్టం

పొందూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అవయవ దానం చేయడం మహోత్కృష్టమని, దీనితో మరణానంతరం 8 మందికి జీవితాన్ని, వెలుగును ప్రసాదించవచ్చని ఆప్తాలమిక్ అధికారి, రోటేరియన్ సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వ హించారు. విద్యార్థులు అవయవదానానికి సారధులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.ఇందిర, పలువురు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### న్యూస్ బాక్స్

### ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం

రణస్థలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి పై ఓవర్ పనులకు గురువారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయన్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

### చెరువు ఆక్రమణల పరిశీలన

సోంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబంద చెరువు ఆక్రమణలను తొలగించాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీటీ మహేష్, సర్వేయర్ నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సర్వే చేపట్టి చెరువు ఆక్రమణలు తొలగించి చెరువు అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు బీన ఆనంద్, బీన ఈశ్వరరావు, పొందూరు రాజు, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీఎన్‌జీవో ఎన్నికలు ఏకగ్రీవం

సోంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోంపేట తాలుకా ఏపీ ఎన్‌జీవో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.నారాయణరావు, కార్యదర్శిగా బి.రవి కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.రమేష్, ఉపాధ్యక్షులుగా హెచ్.సురేష్, ప్రమానంద్ శ్రీధర్, కోశాధికారిగా ఎన్.ఉపేంద్ర, కార్యదర్శులుగా కే.రవికుమార్, విక్రమ్, శాంతి కుమారిని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హనుంతు సాయిరాం, డిప్యూటీ అసిస్టెంట్ కమ ర్షియల్ టాక్స్ కమిషనర్ రాయి వేణుగోపాల్, శ్రీకాకుళం టౌన్ అధ్యక్షుడు బొత్స శ్రీనివాస రావు, అగ్రికల్చర్ విభాగం జయరాం ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

### ఇచ్ఛాపురం ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడిగా శ్రీహరి

ఇచ్ఛాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవో సంఘం ఇచ్ఛాపురం తాలూకా అధ్యక్షుడిగా బలివాడ శ్రీహరి, కార్యదర్శిగా వాసుదేవరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా జేఏసీ చెర్మన్ హనుమంతు సాయిరాం తెలిపారు. కార్యక్రమంలో కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన ఎన్‌జీవో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### ఆందోళనలో రైతన్న

గార, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల రైతులు వరి పంటలను రక్షించుకునేందుకు పాట్లు పడుతున్నారు. పంటను కోసిన వెంటనే ఆరబెట్టి పొలాల్లోనే మిషన్ ద్వారా నూర్పుడి పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు వరి పంటను కుప్పలు కుప్పలుగా పెడుతున్నారు. అందివచ్చిన వరి పంట తడిసిపోయి ఆర్థికంగా నష్ట పోయే ప్రమాదం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.





## జెమ్స్‌కు వచ్చిన సినీ నటుడు జగపతిబాబు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో 15వ వార్షికోత్స వం యుగ్మా-25 గురువారం ఘనంగా నిర్వహిం చారు. ప్రముఖ సినీ నటుడు జగపతిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే గొండు శంకర్, ఆసుపత్రి చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు, ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత హాజరయ్యారు. జగపతిబాబు మాట్లాడుతూ.. వైద్యుల చేతులకు ప్రత్యేక వందనం చేస్తున్నానన్నారు. జెమ్స్ ఆసు పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ పైడిపునాయుడు, రూరల్ ఎస్ఐ కె.రాము, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న హీరో జగపతిబాబు, ఎమ్మెల్యే గొండు శంకర్, బొల్లినేని భాస్కరరావు

### శిక్షణ కేంద్రాల పరిశీలన

గుజరాతీపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వృత్తివిద్యా కోర్సుల వారీగా జరుగుతున్న ఆన్ ది జాబ్ ట్రైనింగ్ కేంద్రాలను జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి (డీవీఈవో) రేగ సురేష్‌కుమార్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి గురువారం పరిశీలించారు. నరసన్నపేట జూని యర్ కళాశాల, జలుమూరు, శ్రీకాకుళం బాలుర కళాశాలకు చెందిన ఎఅండ్‌టీ విద్యార్థులు శిక్షణ పొందుతున్న కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల, దుగ్గివలన రాం ప్రసాద్, ఎంఏఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇరుకు గదుల్లోనే..

- కొన్నిచోట్ల పూర్తికాని సచివాలయ భవనాలు
- మరికొన్ని చోట్ల ప్రారంభానికి నోచుకోక..
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది, ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం



సుందరంగా తయారైనా ప్రారంభానికి నోచుకోని రెంటికోట సచివాలయ భవనం


సగం పనులతో నిలిచిపోయిన బొడ్డపాడు సచివాలయ భవనం

పలాస రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని గ్రామ సచివాలయాల నిర్మాణం పూర్తికాకపోవడం, మరికొన్ని చోట్ల పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో చిన్నచిన్న గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తుంది. పలాస మండలం బొడ్డపాడు, రెంటికోట గ్రామ సచివాలయాలు ఎప్పుడూ వివిధ సమస్యలపై వచ్చేవారితో బిజీబిజీగా ఉంటాయి. రెంటికోట సచివాలయ భవన పనులు పూర్తయినా.. ప్రారంభం కాలేదు. రైతుసేవా కేంద్రం కూడా సిద్ధమైనా ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఓ చిన్న గదిలోనే ఉద్యోగులు కిక్కిరిసి పనులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దీంతో వివిధ అవసరాలపై వస్తున్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆరుబయట వేరే ప్రాంతంలో ప్రారంభించాల్సి వచ్చింది. ధాన్యం తూకానికి కాటా, ఇతర వనరులు ఆ చిన్నపాటి గదిలోనే భద్రపరుస్తున్నారు. ఎదురుగా పెద్ద భవనం ఉన్నా ప్రారంభించక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. బొడ్డపాడు సచివాలయం పనులు సగంలోనే నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామంలో ఉన్న చిన్నపాటి గదుల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇలా మండలంలోని మరికొన్ని సచివాలయాల పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఈ విషయంపై పంచాయతీరాజ్ డీఈ రవి మాట్లాడుతూ.. ప్రస్తుతం హెల్త్‌సెంటర్ల ప్రారంభానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, త్వరలోనే సచివాలయ భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## సొంత భవనమూ నేమ్ బోర్డూ లేదు


కనీసం పేరు కూడా లేని అక్కుపల్లి సచివాలయం

వజ్రపుకొత్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో అతిపెద్ద సచివాలయం పరిధి అక్కుపల్లి. సొంత భవనం లేకపోవడంతో స్థానిక పంచాయతీ భవనంలోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. అక్కుపల్లి, భైపల్లి పంచాయతీలు ఈ సచివాలయ పరిధిలోకి వస్తాయి. సచివాలయ భవన నిర్మాణానికి అప్పట్లో ఎంజేపీ పాఠశాల ప్రాంగణంలో నిర్మాణం చేపట్టడడంతో కోర్టు ఆదేశాలు మేరకు పనులు నిలిచిపోయాయి. దీంతో గ్రామంలో సచివాలయ నిర్మాణానికి సరిపడ స్థలం లేకపోవడంతో పంచాయతీ భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో భవనం చిన్నదిగా ఉండడం, మరుగుదొడ్ల సదుపాయంలేక పోవడంతో సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. ఇదిలా ఉండగా భవనంపై కనీసం నేమ్‌బోర్డు లేకపోవడంతో కొత్తగా సచివాలయానికి వచ్చేవారు తికమకపడుతున్నారు. సచివాలయ భవనం ఎలాగూ లేదు.. కనీసం నేమ్‌బోర్డు అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## సేవలన్నీ ఒకే భవనంలో..


ఇరుకైన పాత పంచాయతీ భవనంలోనే కొనసాగుతున్న సింగుపురం సచివాలయం

పాతపట్నం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): లాబర, సింగుపురం పంచాయతీల్లోని తొమ్మిది గ్రామాలకు సంబంధించి సింగుపురంలో సచివాలయాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివా లయం పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో పాత పంచాయతీ భవనంలోనే ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. రైతుసేవ కేంద్రంతో పాటు పశుసంవర్థకశాఖ సిబ్బంది సైతం ఇందులో నుంచే సేవలు అందిస్తున్నారు. సిబ్బంది కూర్చోవడానికి కూడా స్థలం లేని పరిస్థితి. దీంతో పనులు కోసం వస్తున్న ప్రజలు కనీసం నిల్చోడానికి కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చిన పరికరాలను ఒక మూలన పడేశారు. అయితే సచివాల యం భవన నిర్మాణానికి నిధులు మం జూరైనా సకాలంలో బిల్లులు ఇవ్వకపో వడంతో సగంలోనే పనులు నిలిచిపో యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


సగం పనులతో నిలిచిపోయిన సచివాలయ భవనం

## ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.రాము తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. చోరీలకు పాల్పడుతున్న ఆ ఇద్దరు మైనర్ల నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దొంగిలించిన ఈ బైక్‌లను టెక్కలిలో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా వారిద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీరిద్దరిని జువైనల్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

## సారాతో ఒకరు..

మెళియాపుట్టి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూరమ్మన్నపేట గ్రామానికి చెందిన సవర బుడ్డు ఏడు లీటర్ల సారాతో పట్టుబడినట్టు టెక్కలి ఎక్సైజ్ సీఐ ఎస్‌కే మీరాసాహెబ్ తెలిపారు. పక్కా సమచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్టు తెలిపారు. అతడిని టెక్కలి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

## రేపటిలోగా వివరాలు అందించాలి

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలి పరిధిలో నివాసం ఉంటూ ఇంటి పన్ను చెల్లిస్తున్నవారు తమ ఇంటి పన్ను, ఆధార్ జెరాక్స్, మొబల్ నెంబరును కార్యాలయంలో ఈనెల 29వ తేదీలోగా అందించాలని ఈవో ఏవీ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఇంటి పన్నులు వసూళ్లకు పైన పేర్కొన్న పత్రాలు అవసరమని ఈవో తెలిపారు. పంచాయతీ అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## సంస్థాగతంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

- పార్టీ జాతీయ కార్యదర్శి సురాజ్‌సింగ్ ఠాగూర్



మాట్లాడుతున్న సురాజ్‌సింగ్ ఠాగూర్

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను సంస్థాగత నిర్మాణం ద్వారా బలోపేతం చేద్దామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సురాజ్ సింగ్ ఠాగూర్ అన్నారు. గురువారం టెక్కలిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి కార్యకర్తల మనోభావాలు తెలుసుకుంటానన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టబడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి, నాయకులు వెంకట శివప్రసాద్, పేడాడ పరమేశ్వరరావు, కోత మధు, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

- పాతపట్నం: కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతం అయ్యేలా నిర్మాణాత్మక పనులు చేపట్టాలని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, న్యూఢిల్లీ సూరజ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. స్థానిక ఓ హోటల్‌లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పురోతు వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, జిల్లా నాయకులు పేడాడ పరమేశ్వరరావు, బొచ్చు విజయలక్ష్మి పలువురు నాయకులు ప్రజానీకం పాల్గొన్నారు.

## హెల్త్ సెక్రటరీల నిరవధిక సమ్మె విరమణ

అరసవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకర్తలకు ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ సంఘ సభ్యులు, హెల్త్ సెక్రటరీలు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో బుధవారం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కూడా కొనసాగించారు. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెంటనే స్పందించి రెండు రోజుల్లోగా పదోన్నతులు ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. పదోన్నతుల జాబితాల్లో ఉన్న వారి సర్వీసు రిజిస్టర్లను అందజేయాలని స్పష్టం చేశారు. తక్షణ చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డా.అనిత జిల్లా లోని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం హెల్త్ సెక్రటరీలు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా పదోన్నతులకు సహకరించిన మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎంహెచ్‌వో అనితలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళి, యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, హెల్త్ సెక్రటరీల సంఘ నాయకులు అరుణ, చిన్ని, ప్రభావతి, ధనారెడ్డి, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లింపులో జాప్యం తగదు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు


అధికారులతో చర్చిస్తున్న సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం లీగల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన ప్రమాదాల కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం చెల్లింపులో జాప్యం తగదని జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్య దర్శి కె.హరిబాబు అన్నారు. గురువారం స్థానిక సంస్థ కార్యాలయంలో సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో బాధితులకు సహాయం చేయకపోగా నిర్లక్ష్యంగా యాక్సిడెంట్ చేసినవారు వెళ్లిపోవడం సరికాదన్నారు. అలాంటి వారికి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వి.రామారావు, ఏఎస్ఐ పి.ధర్మారావు, రెవెన్యూ అధికారులు ఎం.నాగేంద్ర ప్రసాద్, ఆర్.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో టెక్కలి విద్యార్థి ప్రతిభ


గణేష్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడల్లో టెక్కలికి చెందిన విద్యార్థి బొడ్డ గణేష్ ప్రతిభ కనబరిచాడు. ఈనెల 24, 25 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 ఈఎస్ విభాగంలో గణేష్ 800 మీటర్ల పరుగుపందెంలో రజిత పతకం సాధించాడు. దీంతో డిసెంబరు 13 నుంచి లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు గణేష్ ఎంపికైనట్లు కోచ్ బసవల బాబూరావు తెలిపారు.

## కార్మిక చట్టాలపై ప్రజాభిప్రాయ సేకరణ

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, అందుకు కేంద్ర కార్మిక కార్యదర్శి వందన గుర్నాని వెల్లడించారని బీజేపీ నాయకులు హనుమంతు ఉదయభాస్కర్ తెలిపారు. 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా పొందుపరిచారని, వేతనాల నియమావళి, 2019 పారిశ్రామిక సంబంధాల నియమావళి, 2020సామాజిక భద్రతా నియమావళి, 2020 ఉద్యోగభద్రత, ఆరోగ్యం, పని, పరిస్థితుల నియమావళి ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి 45 రోజులపాటు ప్రజాభిప్రాయన చేపట్టనున్నట్టు తెలిపారు.

## గోతిలో పడి ఆవు మృతి


గోతిలో పడిన ఆవు

వజ్రపుకొత్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గరుడభద్ర ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న గోతులో గురువారం ఓ ఆవు పడి మృతి చెందింది. ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్ల గోతులు తీసి ఇలా వదిలేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాగా మృతి చెందిన ఆవు ఖరీదు రూ.70 వేలు ఉంటుందని పాడి రైతు తెలిపారు.

## విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం


నరసన్నపేట: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు శారీరక, మానసిక వికాసం పెంపొందిస్తాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం ఉర్లాం ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయిలో గ్రిగ్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పొందర, కురాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్, వంశధార డీసీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఇసా అప్పారావు, రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి జల్లు చంద్రమౌళి, తొగరాం ఉన్నత పాఠశాల హెచ్ఎం యాళ్ల పోలినాయుడు, పీడీలు రమణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

- హరిపురం: ఆటలతోనే విద్యార్థులకు మానసికోల్లాసం లభిస్తుందని ఎంఈవో ఎం.లక్ష్మణరావు అన్నారు. మందస మండలం జీఆర్ పురం హైస్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించిన మండల స్థాయి గ్రిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.రమణమూర్తి, భాస్కరరావు, హరీష్, కె.గోపాలకృష్ణ, హేమారావు చౌదరి, తవిటయ్య పాల్గొన్నారు.

- కోటబొమ్మాళి: మండల కేంద్రంలో నిర్వహించిన గ్రిగ్స్ పోటీల్లో స్థానిక జ్యోతిరావుపూలే పాఠశాలకు చెందిన విద్యార్థులు సీనియర్ వాలీ బాల్, సీనియర్ ఖోఖో విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. జూనియర్ వాలీబాల్ విభాగంలో తిలారు జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈవో డి.గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

- పాతపట్నం రూరల్: పెద్దసీది జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం సింహాచలం, పీడీ కె.మురళీమోహనరావు, శేఖర్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు జరిగాయి. 15 పాఠశాలలకు చెందిన సుమారు 300మంది విద్యార్థులు పాల్గొని ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీపడ్డారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, స్కూల్ చైర్మన్ విశ్వనాథం, ఎంఈవోలు గోవిందరావు, తిరుమలరావు, సీది, తీమర సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

- పోలాకి: కోడూరు ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన గ్రిగ్స్ పోటీల్లో విజేతలను అభినందించారు. హెచ్ఎం జి.శాంతి, పీఈటీ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జ్ఞానయజ్ఞం ఆధ్యాత్మిక చైతన్యానికి శ్రీకారం


విరాళాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జ్ఞానయజ్ఞం ఆధ్యాత్మిక చైతన్యానికి శ్రీకారం అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మేజర్ పంచాయతీ పాతపట్నం పరిధిలోని కె.గోపాలపురంలో శివానంద కుటీరవారి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీమద్భాగవద్గీత- జ్ఞానయజ్ఞం ప్రవచన కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. భగవద్గీత మనిషిని ధర్మబద్ధమైన జీవితానికి నడిపించే మార్గాన్ని బోధిస్తుందన్నారు. కుటీర అభివృద్ధికిగానూ నిర్వాహకులకు రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు గ్రామపెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


మిల్లర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

పోలాకి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలాకి, ఈదులవలసలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను గురువారం శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ధాన్యం కొనుగోలు విషయంలో సిబ్బంది నిబంధనలు పాటించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీను, ఉన్నారు.

## విజ్ఞానాన్ని వెలికితీసేందుకే ప్రతిభా పరీక్షలు

జలుమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. శ్రీముఖలింగం ఉన్నతపాఠశాలలో గీతాజయంతి పురస్కరించుకొని గురువారం నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పరీక్షల్లో నాలుగు మండలాలకు చెందిన 123 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో ఎల్ఎన్ పేట ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.వర్ష ప్రథమ స్థానం, శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలకు చెందిన పీటీ రాహుల్ ద్వితీయ స్థానం, యలమంచిలి ఉన్నతపాఠశాలకు చెందిన సీహెచ్ యశ్వంత్ తృతీయ స్థానంలో నిలిచారు. శ్రీముఖలింగం ఉన్నతపాఠశాలకు చెందిన పి.తేజేశ్వరి ప్రోత్సాహక బహుమతి లభించింది. ఎంఈవో-2 ప్రసాదరావు, హెచ్ఎం పి.సూర్యప్రభాకరరావు, గీతా సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుపై హర్షం


సీఎం, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేయడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం రావివలసలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చెర్మన్ బగాధి శేశగిరిరావు, ఎల్ఎల్ నాయుడు, జగదీష్, రాము, ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కొత్తమ్మతల్లి ఆలయంలోపాటు రావివ లస ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిధులు మంజూరు చేయడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ రెండు ఆలయాల అభివృద్ధికి రూ.6.40 కోట్లు మంజూ రు చేయించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్థానిక కొతమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి టపాసులు కాల్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ గోవిందరావు, ఈవో వాకచర్ల రాధాకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్‌డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్(22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

## శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

పలాస, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ శ్మశానవాటిక వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయిందని, తక్షణమే అభివృద్ధి చేయాలని కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా కోరారు. గురువారం మధ్యాహ్నం చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్మశానవాటికలోని పరిస్థితుల ఫోటోలు సభ్యులకు చూపించిన దుర్గాశంకర్ పండా తన ఆవేదన వ్యక్తం చేస్తూ ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి శ్మశానవాటికలో కొంతభాగం అభివృద్ధి చేసి మునిసిపాలిటీకి అప్పగించారన్నారు. అప్పటి నుంచి ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. దీనిపై డీఈఈ కనకరాజు సమాధానం ఇచ్చినా ఆయన సంతృప్తిచెందలేదు. కౌన్సిలర్ ఎస్.గీత మాట్లాడుతూ తన వార్డులో సొంతడబ్బులు వెచ్చించి నాలుగున్నరేళ్ల కిందట పవర్‌బోర్ వేశామని, ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన బిల్లుల ఫైల్ ఎక్కడుందో అధికారులకే తెలియడం లేదన్నారు. కౌన్సిలర్ పప్పల ప్రసాదరావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విభాగంలో అనేక ఫైల్స్ మాయం అయ్యాయని, ఎం.బుక్‌లు కూడా కనిపించడం లేదంటే ఆ విభాగం పనితీరు ఏ విధంగా ఉందో గుర్తించాలని సభకు తెలిపారు. వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఇక్కడ మాత్రం కాంట్రాక్టర్లకు కౌన్సిలర్లు ముందుగానే డబ్బులు ఇచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ తన వార్డులో పగలే వీధి దీపాలు వెలిగిపోతున్నాయని, ఉద్దానం కుళాయిల ద్వారా వారానికి ఒకసారి మాత్రమే తాగునీరు వస్తుందన్నారు. కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించి కొత్త పనులకు మోక్షం కల్పించాలన్నారు. అంతకు ముందు కొత్తగా విధుల్లో చేరిన కమిషనర్ ఇ.శ్రీనివాసులును సభకు పరిచయం కాగా, ఆయన్ను ఘనంగా పాలకవర్గం సత్కరించింది.


డీఈఈ కనకరాజు, దుర్గాశంకర్ పండా మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్ఎన్ పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో గల 33 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ ఇ.నరసింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉపకేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

- పాతపట్నం: స్థానిక 33, 11కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనుందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 2 రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ నరసింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో పాతపట్నంతోపాటు రంకిణి కోడూరు, దశరథపురం, తిడ్డిమి, చంగుడి, సరాళి పంచాయతీల్లో విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్టు తెలిపారు.

## నేడు మండల సమావేశం

ఎల్ఎన్ పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని, అన్ని శాఖల అధికారులు రావాలన్నారు.

### నందిగాంలో రేపు..

నందిగాం: మండల సర్వసభ్య సమావేశం శనివారం జరపనున్నట్టు ఎంపీడీవో యు.కుమార్ పట్నాయక్ గురువారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన శనివారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని, గౌరవ సభ్యులతో పాటు మండలానికి సంబంధించిన అధికారులు హాజరు కావాలని కోరారు.


## డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న స్కిల్‌హబ్ కేంద్రం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగినవారు అర్హులని, బయోడేటా, కలర్ ఫొటో, సర్టిఫికేట్లతో హాజరు కావాలని కోరారు.

## ఎన్జీవో కార్యవర్గం

కాశీబుగ్గ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ పలాస శాఖ అధ్యక్షుడిగా బోనెల గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కాశీబుగ్గ హైస్కూల్ పక్కన ఉన్న అసోసియేషన్ భవనంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. డిప్యూటీ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ కమిషనర్ వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కోఆపరేటీవ్ అధికారి రవికుమార్ ఎన్నికల అధికారులు గా వ్యవహరించారు. కార్యదర్శిగా ఉపేంద్ర, అసోసి యేషన్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, కోశాధికారి ఉదయ్‌శంకర్ తదితరులను ఎన్నుకున్నారు.

## రగ్బీ పోటీలకు ఎంపిక


గణేష్

పాతపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం చదువుతున్న అంబటి గణేష్ జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ టిహేమసుందరరావు తెలిపారు. ఈ నెల 23,24 తేదీల్లో కర్నూల్ వేదికగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు. శ్రీకాకుళం జట్టులో కీలకపాత్ర పోషించిన ఎ.గణేష్, బి.ప్రసాద్, పి.వంశీ అభినందించారు.

## విద్యాప్రమాణాలు పరిశీలన

పోలాకి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సుసరాం, కోడూరు ఉన్నతపాఠశాలల పదోతరగతి విద్యార్థుల విద్యాప్రమాణాలను గురువారం వమరవల్లి డైట్ అధ్యాపక బృందం పరిశీలించింది. 100 రోజుల ప్రణాళిక, ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా డైట్ బృందసభ్యులు పరిశీలించారు. విద్యాప్రగతి, ఉపాధ్యాయుల బోధన సిలబస్ తదితర అంశాలపై విద్యార్థుల నుంచి ఆరాతీశారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలను విద్యార్థులు పొందిన మార్కుల వివరాలను అడిగితెలుసుకున్నారు. బృంద సభ్యులు సనపల మురళి, వాసుదేవరావు, డి.లోకేశ్వరి, కె.నాగవల్లి, సిబ్బంది ఉన్నారు.